క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ నిరాహార దీక్ష

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో 36 గంటలు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి పేర్కొన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూం సముదాయం వద్ద బుధవారం ఉదయం 11గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3గంటల వరకు ఈ దీక్ష కొనసాగించనునట్లు తెలిపారు.

22న యూత్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో ఈనెల 22వ తేదీన రోజు భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో యూత్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఉద్యోగ అన్వేషకులను ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చే ముఖ్య ఉద్దేశంతో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 – 35 వయస్సు ఉన్న వారికి ఈ అవకాశం ఉంటుందని ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు. ఈ క్యాంప్‌లో వ్యాపార అభివృద్ధి శిక్షణ, ఉపాధికర్తలకు శిక్షణ ఇవ్వనున్నట్లు, జాతీయ బ్యాంకుల నుంచి ఎలాంటి గ్యారెంటీ లేకుండా లక్ష రుపాయల నుంచి రూ.50లక్షల వరకు రుణాలు అందేలా చూస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు 70 బెంచీల అందజేత

జగద్గిరిగుట్ట: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఎండీ బాబురావు అన్నారు. జగద్గిరినగర్ ప్రభుత్వ పాఠశాలకు మంగళవారం లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి 70 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శివకుమార్ వారికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పాఠశాలలో లైబ్రరీ కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, కమల్ కిషోర్, మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, సాయిరామ్ రాజు, దినేష్, అనిల్ కుమార్, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే ధ్యేయం

నిజాంపేట్: ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆదిత్య లేక్‌వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్టీఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీల్లో వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయలని, రాకపోకలకు ఆటకంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను షిఫ్టింగ్ చేయాలని కోరారు. ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ, ఆదిత్య లేక్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ నాగి రెడ్డి, ట్రెజరర్ భరత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ముందుంటాం

నిజాంపేట్: ప్రభుత్వ ఆస్తులు, భూముల పరిరక్షణకు బీజేపీ ఎప్పుడు ముందుంటుందని నిజాంపేట్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. మంగళవారం బాచుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాచుపల్లి సర్వే నం. 111, 112లో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్‌కు చెందిన ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలను చెరువు స్థలంలో నిర్మిస్తున్నారని తెలిపారు. రెసిడెన్సియల్ జోన్‌లో కమర్షియల్ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు దీనిపై స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ కార్పొరేషన్ సెక్రటరీ శేషారావు, ట్రేడర్‌సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోవింద్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యోగా.. ఆరోగ్యంగా!

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



వక్రాసనం..



సూర్య నమస్కారాలు

సుభాష్‌నగర్: నిత్య జీవితంలో యోగా ఒక భాగంగా పెట్టుకుంటే మనం ఆరోగ్యవంతులం అవుతాం. కానీ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది వ్యాయామం చేయడమే మర్చిపోయారు. దీనికి తోడుగా కొంతమంది బద్ధకంతో తమ పనులు తాము చేసుకోకుండా ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో యుక్త వయసు నుంచే శరీరానికి ఏ చిన్న సమస్య వచ్చినా మాత్రలు తీసుకోవడం.. ఆసుపత్రికి పరుగులు పెట్టడం అలవాటుగా మారిపోయింది. నేటి యాంత్రిక జీవనంలో చిన్నచిన్న సమస్యలకు ఒత్తిడి తట్టుకోలేని పరిస్థితిలో యువత ధైర్యాన్ని కోల్పోతున్నారు. దీనంతటికి ప్రతిరోజు వ్యాయామం చేయకపోవడమే కారణంగా చెప్పుకోవచ్చు. ప్రతిరోజు గంట పాటు యోగా చేసినట్లయితే వీటన్నిటికి ఫుల్‌స్టాప్ పెట్టొచ్చని యోగా నిపుణులు పేర్కొంటున్నారు. శరీరం మనసును ఏకం చేయడమే యోగాలోని పరమార్థం. 5వేల ఏళ్ల చరిత్ర కలిగిన యోగా శాస్త్రం, ప్రపంచానికి భారతీయులు అందించిన అద్భుతమైన కానుక. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా "సాక్షి" ప్రత్యేక కథనం.

యోగా ప్రాముఖ్యత....

ఆరోగ్యం అంటే అందరూ శరీరానికి సంబంధించినదని అనుకుంటారు. నిజమైన ఆరోగ్యానికి మూలాలు మనసులో ఉంటాయి. మనసు నిర్మలంగా నిచ్చలంగా ఉన్నచోట వ్యాధులకు ఆస్కారం చాలా తక్కువ. శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే మనం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు. మనం రకరకాల వ్యాయమాలు చేస్తుంటాం. పుష్టినిచ్చే ఆహారం తీసుకుంటాం. మందులు వేసుకుంటాం. కానీ ఎన్ని చేసినా ఇవన్నీ శరీరాన్ని తప్పించి మనసును తాకలేవు అని యోగా నిపుణులు బల్ల గుద్ది చెపుతున్నారు. మనసును కూడా స్పర్శించి శరీరాన్ని మనసును బ్యాలెన్స్ చేసే శక్తి ఒక యోగా అభ్యాసానికి మాత్రమే ఉంటుందని పేర్కొంటున్నారు. శరీరాన్ని మనసును ఒక గాడిలో పెట్టి రెండింటిని సమతుల్యంలోకి తెచ్చేదే యోగా. యోగాకున్న సమగ్రత సంపూర్ణత్వం మరి ఇతర సాధారణ వ్యాయమాలకు ఉండదు. యోగాసనాల వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శరీరం నుంచి విషతుల్యాలు వేగంగా బయటకు వెళ్లిపోతాయి. అవయవాల పనితీరు బాగుంటుంది. మనసును శ్వాస ప్రక్రియపై లగ్నం చేసి ఏకాగ్రత సాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత సిద్ధిస్తుంది. సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. నానా రకాల వత్తిళ్లలో కురుకపోతున్న నేటి తరానికి యోగా అత్యంత ఆవశ్యకంగా మారింది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో మానసిక బలంతో నిత్యం యవ్వనంగా జీవించవచ్చు. రోజు కొద్దిసేపు యోగా చేస్తే అనారోగ్యం దరిచేరదు.



దీలాసనం..





యోగా వల్ల కలిగే ప్రయోజనాలు

- ఎముకలను ధృఢంగా శక్తివంతం చేస్తుంది.
- రోగ నిరోధక శక్తి పెరగటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.
- అధికంగా ఆహారం తినాలి అని మీ కోరికకు అడ్డుకట్ట వేస్తుంది.
- నిద్రలేమిని తరిమి కొట్టడానికి యోగా బాగా సహాయపడుతుంది.
- రక్తపోటును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. యోగా గుండె యొక్క ఆరోగ్యాన్ని పెంచుతుంది.
- శరీరంలోని అంతస్రావ విధులను మెరుగుపరచడంలో యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది.
- రక్తంలో ఉన్న ట్రై గ్లిజ రాయిడ్స్ సంఖ్యను తగ్గిస్తుంది.
- మతిమరుపు వ్యాధిపై పోరాటం చేయడానికి ఉపయోగపడుతుంది.
- మధుమేహం దరిచేరకుండా ప్రభావంతంగా ఎదుర్కొంటుంది.

30ఏళ్లుగా యోగా చేస్తున్నా..



30 సంవత్సరాలుగా నిత్యం యోగా చేస్తున్నాను. ఇప్పటికే తాను వేల మందికి యోగా నేర్పించాను. అందులో చాలామంది యోగా గురువులుగా మారి ఇతరులకు నేర్పిస్తున్నారు. ప్రతిరోజు ఒక గంట పాటు యోగా చేస్తే ఎలాంటి వ్యాధులు మన దరికి చేరవు.

– ప్రహ్లాద్, యోగా గురువు

సుచిత్ర వేదికగా 500మందితో..



ఆరోగ్యాన్ని పట్టించుకోక పోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. నిత్యం ఒక గంట యోగా చేసి ఆరోగ్యంగా ఉందాం. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శివోహం యోగా రీసర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో 500 మందితో సుచిత్ర చౌరస్తాలో బుధవారం ఉదయం 5.30 గంటలకు ఉచితంగా యోగా నేర్పించి ప్రాముఖ్యతను తెలియజేస్తాం. ఈ కార్యక్రమానికి పోలీస్ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. అందరూ ఆహ్వానితులే.

– కె.రవీందర్ రాజు, యోగా గురువు

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింది

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. "కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా"లో భాగంగా మంగళవారం ఆయన రంగారెడ్డినగర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీనగర్, సౌభాగ్యనగర్, ఆదర్శ్ నగర్, సుమిత్రానగర్, గూడెన్‌మెట్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. బస్తీలలో కనీసం మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. పేదల కోసం కేంద్రం తీసుకు వచ్చిన ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాన్ని రాష్ట్రం అమలు చేయకుండా కార్పొరేట్ ఆసుపత్రులకు రాష్ట ప్రభుత్వం వంతపాడుతుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఉచితంగా వైద్యం, విద్యను అందిస్తామని పేర్కొన్నారు.

◆ ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏర్వ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గరిగె శేఖర్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి జగన్ మోహన్‌రావు, డివిజన్ ఇన్‌చార్జ్ మోతె శ్రీనివాస్ యాదవ్, ఏపీహెచ్‌బీ కాలనీ గౌరవ అధ్యక్షుడు రామచందర్‌రావు, గూడెన్‌మెట్ కాలనీ ప్రెసిడెంట్ చాపల కృష్ణ, సుమిత్ర కాలనీ అడ్వైజర్ బ్రహ్మానందం, నాయకులు చెరుకు లావణ్య, అశోక్, తోకల శ్రీను, జూల సందీప్, వెంకటేష్, చెంచు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీనగర్‌లో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

తెలంగాణ వాదం కాపాడుకోవడానికి ఏకం కావాలి



షాపూర్‌నగర్‌లో బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రజలు కోట్లాది తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రం నేడు కేసీఆర్ కుటుంబ కబంధ హస్తాల్లో చిక్కుకుందని తెలంగాణ జన సమితి నాయకుడు అశోక్‌రెడ్డి అన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో చేపట్టబోయే బస్సు యాత్ర పోస్టర్‌ను మంగళవారం షాపూర్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన సమితి నాయకులు మాట్లాడుతూ.. నేడు తెలంగాణాలో నిరంకుశ పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నో పోరాటలు, ఉద్యమాలు, రోడ్లపై రాస్తారోకోలు, సహాయ నిరాకరణల ద్వారా సాధించుకున్న తెలంగాణలో నేడు ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

◆ బస్సు యాత్ర ద్వారా తెలంగాణ సమాజానికి జరుగుతున్న అన్యాయాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తామన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామమైన అక్కంపేట్ నుంచి మేడారం వరకు బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. తెలంగాణ వాదాన్ని కాపాడుకోవడానికి మేధావులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ బస్సు యాత్రలో పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, ప్రజలు పాల్గొని మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్ర వీరన్న, స్థానిక నాయకులు నర్సింహులు, మణికుమార్, విజయకుమార్, సికిందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ప్రాగా టూల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్‌సీఎల్ గోదావరి, దుర్గా విహార్, శాంతా శ్రీరామ్, ఆదిత్య విల్లాస్, కోణార్క్ ఆస్పత్రి రోడ్డు, ప్రాగా టూల్స్ కాలనీ, జీఎల్ఆర్ ఎన్‌క్లేవ్, లక్ష్మీ గంగా...

◆ అదే విధంగా 11 కేవీ పైపులైన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 6గంటల వరకు బీహెచ్ఈఎల్ విస్టా కాలనీ, ఆర్తీ కల్చర్, శ్వేల ఆర్యన్, ఆరమ్స్‌బర్గ్, ఆర్వీ నిర్మాన్స్, మారుతి సన్ సిటీ, సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన ఓక్రిడ్జ్ విద్యార్థులు

దుండిగల్: తమ పాఠశాల విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. బౌరంపేటలోని స్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ యూత్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తమ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారన్నారు. క్రిషా, మీరా, కృతికలు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారన్నారు.

అదే విధంగా గ్రేడ్–7 ఐజీసీఎస్ఈ విద్యార్థిని అదిత్వ నిరుపేద పిల్లలకు జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందిస్తోందన్నారు. ఎస్‌టీఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్ అండ్ మ్యాథ్స్) లీడ్ అండ్ సీనియర్ సెకండరీ ఫిజిక్స్ ఫెసిలిటేటర్ అయిన శ్రీధర్ మన్నం బోస్టన్‌లో జరిగే ప్రతిష్టాత్మకమైన సమ్మర్ ఎంఐటీ (మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ వీక్‌కు ఆహ్వానం అందుకున్నారన్నారు.

◆ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, సామాజిక కార్యక్రమాలలో క్రియాశీలకంగా ఉండడం, కొత్త బిజినెస్ వెంచర్లను ప్రారంభించడంలో అసాధారణ ప్రతిభ కలిగిన ఎస్.శార్వరీ తన అత్యుత్తమ విజయాలకు పెన్ స్టేట్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ యూనివర్సిటీ, స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ వంటి సుప్రసిద్ధ విశ్వవిద్యాలయాల నుంచి ఆఫర్లు వచ్చాయన్నారు. ఇలా ఎన్నో విజయాలను సమోదు చేశామని ఆమె పేర్కొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

'తప్పిపోయిన 4గంటల్లో ఆచూకీ కనుక్కున్నారు'

- ఇద్దరు పిల్లలను తండ్రికి అప్పగించిన పోలీసులు



జీడిమెట్ల: ఇంటి నుంచి ఆడుకోవడానికి బయటకు వచ్చిన ఇద్దరు పిల్లలు తప్పిపోయారు. ఫిర్యాదు స్వీకరించిన 4గంటల్లోనే జీడిమెట్ల పోలీసులు పిల్లల ఆచూకీ కనుక్కుని తండ్రికి అప్పగించారు. జీడిమెట్ల సీఐ పవన్ వివరాల ప్రకారం.. చింతల్ ద్వారకానగర్‌కు చెందిన మహబూబ్ బాషాకు ఇద్దరు కుమారులు అర్షన్(5), జయెద్(4) కుమారులు. వీరు ఇద్దరు మంగళవారం ఆడుకోవడానికి బయటకు వచ్చారు. పిల్లలు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ విషయమై పిల్లల తండ్రి మహబూబ్ బాషా జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ పవన్ బ్లూకోర్ట్స్, పెట్రోలింగ్ వాహనాన్ని అప్రమత్తం చేశారు. రాత్రి 8.15గంటల ప్రాంతంలో పోలీసులు ఇద్దరు బాలురను చింతల్‌లోని మాంగళ్య షాపింగ్ మాల్ వద్ద పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి తండ్రి మహబూబ్ బాషాకు అప్పగించారు. అనంతరం మహబూబ్ బాషా పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పరారీలో ఉన్న గంజాయి విక్రేతల రిమాండ్

కుత్బుల్లాపూర్: గంజాయి, అక్రమ మద్యం కేసుల్లో నిందితులుగా ఉండి పరారీలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో ఉండటంతో మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ విజయభాస్కర్ వారిని తెలంగాణాకు రప్పించేందుకు రాష్ట ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు బృందాలను పంపాల్సిందిగా కోరారు. దీంతో ఒక బృందానికి మేడ్చల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య, మరో బృందానికి జీవన్ కిరణ్‌లు నేతృత్వం వహించారు. మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మార్చిలో నమోదైన అక్రమ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ప్రవీణ్‌కుమార్ సింగ్‌ను ఢిల్లీలోని బాబామొహల్లా ప్రాంతంలో అరెస్ట్ చేశారు.

◆ కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మద్యం సరఫరా కేసులో నిందితుడు అజయ్‌కుమార్ గార్గ్‌ను, సన్నీ అనే వ్యక్తిని గుర్గామ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడు రవి అలియాస్ అజయ్‌కుమార్ శర్మను గుర్గావ్‌లో అరెస్ట్ చేసి అక్కడి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌తో హైదరాబాద్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి విజయ భాస్కర్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో మేడ్చల్ ఎక్సైజ్ సీఐ జగన్ మోహన్‌రెడ్డి, ఎస్ఐ రాఘువేశ్వర్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్య, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు సహదేవ్, వెంకట్రామిరెడ్డి, లతీఫ్, సిబ్బంది సత్తార్, శ్రీనివాస్, నూర్ బాషా, దినకరన్‌లు పాల్గొన్నట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ తెలిపారు.

ఘనంగా విద్యా దినోత్సవం

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో "తెలంగాణ విద్యా దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. కొంపల్లి, దూలపల్లి, బహదూర్‌పల్లి, సూరారం, నిజాంపేట్, చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన విద్యా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లను కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి లతో కలిసి ప్రారంభించారు. – విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నోట్ – టెక్ట్స్ బుక్స్, ఒక్కొకరికీ రెండు జతల యూనిఫాంలను అందజేశారు. అనంతరం "రాగి జావ"పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు పంపిణీ చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి అనేక చర్యలు తీసుకుందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో 20,375 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం సంఖ్య 24,735కు పెరిగిందన్నారు. విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు మాద్యమాల్లో బోధనతో పాటు, ఉచితంగా యూనిఫామ్, పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్లు శ్రీహరి, సత్యనారాయణ, రామకృష్ణారావు, ఎంఆర్పీ రమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

చింతల్: మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో విద్యా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న పలువురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. చింతల్ డివిజన్ నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ముమ్ముందు సైతం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాన్నారు.

విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటాం

సుభాష్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు.గాజులరామారంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలో మంగళవారం ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పున్నారెడ్డి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డినగర్‌లో....

రంగారెడ్డినగర్: చెన్నారెడ్డినగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం కల్పనరెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌ను అందజేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమములో పంచశీల ఫౌండేషన్ అధ్యక్షుడు జింకల వెంకటేశ్ ముదిరాజ్, శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు రాజేశ్వర్, సూర్యనారాయణ, ప్రముఖ కవి వాకిటి రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగి జావాను అందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

చార్జీలు పెంచడమే అభివృద్ధా.?

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పాలనలో నల్లా బిల్లులు మొదలుకుని కరెంట్, ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెంచారని.. చార్జీలు పెంచడమే అభివృద్ధా అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ప్రశ్నించారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఆయన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్‌తో కలిసి ప్రజా సమస్యలపై పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భూపతిరెడ్డి మాట్లాడారు. కొంపల్లి మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించడంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. గతంలో రూ.50 ఉన్న నల్లా బిల్లు రూ.2వేలకు చేసిన ఘనత బీఆర్ఎస్ పాలకులకే చెందుతుందన్నారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక కౌన్సిలర్లతో కలిసి వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నరెడ్డి, కొంపల్లి పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు సదానందం, కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, కుత్బుల్లాపూర్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ బైరి సరితగౌడ్, మాజీ సింగల్ విండో చైర్మన్ యతి రాజారావు, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూపతిరెడ్డి



కొంపల్లి మున్సిపాలిటీలో సమస్యలు తెలుసుకుంటున్న భూపతిరెడ్డి